
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శుక్రవారం 31 జనవరి 2025

మొక్కజొన్నకు
కోతుల బెడద

- పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- సోలార్ సిస్టంతో పంట చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు రైతుల ఆసక్తి

8

సంగారెడ్డిలో మహాత్మాగాంధీకి జగ్గారెడ్డి నివాళి

మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నివాళులర్పించారు. పట్టణంలోని గంజ్‌మైదాన్‌లో ఉన్న మహత్ముడి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం జాతిపిత మహాత్మాగాంధీ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్, మహేశ్, జార్జి, కసిని రాజు, సుధాకర్, వైప్రభు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గంజ్ మైదాన్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నాయకులు



సంగారెడ్డిలోని గంజ్ మైదాన్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

అమరవీరుల అడుగుజాడల్లో నడవాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటక్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం ఎన్నో త్యాగాలు చేసిన అమరవీరులను మనం ఎల్లవేళలా స్మరిస్తూ వారి అడుగుజాడల్లో నడవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. గురువారం అమరవీరుల దినోత్సవం, గాంధీ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. నేటి మన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, ఆనాటి వీరుల అసమాన త్యాగాల ఫలం, ఆ మహానుభావుల మహా ప్రసాదం అని కొనియాడారు. ప్రతీ ఒక్కరూ శ్రమించడం, సేవా దృక్పథం, ఆధ్యాత్మిక దృక్కోణం, ఒక జీవితంలో ప్రధాన అంశాలుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయ అధికారులు సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లాలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి పూల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థి విద్యార్థులు, యువకులు వివిధ వాహనాల డ్రైవర్లతో కలిసి గురువారం సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సూచించారు.



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీ అనురాధ



అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న కాలనీవాసులు

కబ్జా చేసినా
పట్టించుకోరా?

- మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని హౌజింగ్ బోర్డు, ప్రెస్ కాలనీవాసుల ఆరోపణ

సిద్దిపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని 4వ వార్డు హౌజింగ్ బోర్డుకాలనీ నుంచి సుడా కార్యాలయానికి వెళ్లే సీసీ రహదారిని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టినా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం దారుణమని, రోడ్డును కబ్జా చేస్తే పట్టించుకునేవారా లేరా అంటూ హౌజింగ్ బోర్డు, ప్రెస్‌కాలనీవాసుల ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేటలోని పలువురు భూయజమానులు మాట్లాడుతూ హౌజింగ్ బోర్డు, ప్రెస్‌కాలనీలోని సర్వే నంబర్ 1340లో కొన్ని రోజుల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండానే ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇళ్ల నిర్మాణం చేపట్టి రోడ్డును కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నాడని, ఈ విషయాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిశీలిస్తామని చెప్పారన్నారు. కొద్దిరోజులుగా రాత్రివేళల్లో సీసీరోడ్డును పూర్తిగా కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీబీ తీసుకొచ్చినా కూడా అధికారులు కూల్చకుండా వెళ్లిపోవడంపై స్థానికులు వారితో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్‌టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడుతూ, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సంప్రదించకపోతే కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని, అధికారుల తీరుపై కలెక్టర్ మనుచౌదరికి వివరిస్తామని హెచ్చరించారు.

ఒంటిపై డీజిల్ పోసుకుని
ఆత్మహత్యాయత్నం

- ఇంటి గోడ కూల్చారంటూ సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఓ కుటుంబం హల్‌చల్
- మాజీ కౌన్సిలర్ కక్ష సాధింపుతో చేస్తున్నారని ఆవేదన

7

భూములు

అమ్మబడును

- ఏడాదిగా కుదేలైన రియల్ ఎస్టేట్ ● నష్టపోయిన 'రియల్' వ్యాపారులు ● తక్కువధరకే స్థలాలు, ఫ్లాట్లు, భూముల విక్రయం
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ తగ్గిన లావాదేవీలు ● రూ.5.79కోట్లకు పైగా పడిపోయిన ఆదాయం

"మర్కుక్ మండలంలో ఎకరం రూ.2.50 కోట్లకు పలికిన ధరలు దారుణంగా పతనమయ్యాయి. ఇదే భూమిని ఇటీవల రూ.95 లక్షలకు ఎకరం చొప్పున విక్రయించారు. వర్గల్ మండలం శేరిపల్లి గ్రామంలో 2023 లో కోటిన్నర పలికిన భూమి ఏడాది తర్వాత రూ.కోటి లోపల విక్రయానికి సిద్ధమైంది".

"కోహెడ మండల కేంద్రంలో ఏడాది క్రితం గుంట భూమికి రూ.30లక్షలు పలికింది. ప్రస్తుతం రూ.15లక్షల నుంచి రూ.20లక్షలకు పడిపోయింది. అయినా కొనడానికి ముందుకు రావడంలేదు. ఇక కోహెడలోనే ఏడాది కిందటే ఓ ఇంటికి రూ.32లక్షలకు అడిగినా ఇవ్వలేదు. ప్రస్తుతం అదే ఇంటిని రూ.24లక్షలకు విక్రయించారు.

"సిద్దిపేటలోని ఒక అపార్ట్‌మెంటులోని డబుల్ బెడ్రూమ్ ఫ్లాటును ఏడాది క్రితం రూ.50లక్షలకు అమ్మకానికి పెట్టారు. ప్రస్తుతం అదే ఫ్లాటును రూ.30 లక్షలకు విక్రయించడానికి తయారయ్యారు. కొత్త అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, సెకండ్ హ్యాండ్ ఫ్లాట్లు సిద్దిపేటలో వందలాది సంఖ్యలో అమ్మకానికి పెట్టినా కొనేవాళ్లు రావడంలేదు."

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి30



సిద్దిపేట శివారులో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన వెంచర్‌లోని ప్లాట్ల పరిస్థితి

జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నప్పటికీ, పారిశ్రామికంగా, విద్యాసంస్థల పరంగా అభివృద్ధి చెందినప్పటికీ, ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్, నేషనల్ హైవేలు విస్తరించినప్పటికీ భూముల ధరలు స్థంబించాయి. ఏడాది క్రితం వరకు ఆకాశాన్నంటిన వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల ధరలు ప్రస్తుతం నేలచూపులు చూస్తున్నాయి. రియల్ వ్యాపారంపై పెట్టుబడులు పెట్టిన వారంతా తక్కువ ధరలకు అమ్మలేక.. నష్టాలను భరించలేక తలలు పట్టుకుంటున్నారు.

జిల్లా	1-04-2023 నుంచి 25-01-2024 వరకు డాక్యుమెంట్లు	1-04-2024 నుంచి 25-01-2025 వరకు డాక్యుమెంట్లు	తగ్గిన ఆదాయం
సిద్దిపేట	34,462	28,406	రూ.5.79 కోట్లు

ఏడాదిలోనే ధమాల్..

2014 నుంచి 2023 వరకు జిల్లా విస్తృతంగా అభివృద్ధి చెందింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, కీలక మంత్రి హరీశ్‌రావు ఇదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించడంతో అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు సమకూర్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, సుందరీకరణ పనులు, జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాలను చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మించి నీటిని నింపడంతో వ్యవసాయభూముల ధరలు చుక్కలను తాకాయి. ఆంధ్రప్రదేశ్‌తోపాటు హైదరాబాద్, ఇతర జిల్లాల రియల్టర్లు సిద్దిపేట నలుమూలలా పెట్టుబడులు పెట్టారు. స్థానిక రియల్టర్లూ పదేళ్లపాటు హవా సాగించారు. ఏడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా రియల్ వ్యాపారం కుదేలైంది.

కళతప్పిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు..

ఒకప్పుడు కళకళలాడిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నేడు కళతప్పాయి. మ్యూటేషన్లు, మార్టిగేజ్ డాక్యుమెంట్లు ఎక్కువగా వస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. భూముల విలువ పతనం కావడంతో క్రయవిక్రయాలు సైతం తగ్గాయి. డాక్యుమెంట్లు తక్కువగా వస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

మిగతా 8వ పేజీలో...



వెలవెలబోతున్న సిద్దిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



అక్రమ నిర్మాణాలను చేపడితే సహించం

- మున్సిపల్ కమిషనర్ నరసయ్య

గజ్వేల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను చేపడితే సహించేదీ లేదని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య హెచ్చరించారు. గజ్వేల్‌లో అక్రమ నిర్మాణాలను గురువారం ఆయన టీపీవో శ్రీధర్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఇంటి నిర్మాణాలను చేపట్టేవారు తప్పనిసరిగా పురపాలక సంఘ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఆ ప్రకారమే నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నా రు. వారివెంట పురపాలక సంఘం సిబ్బంది ఉన్నారు.

దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జనవరి30 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా మట్ట శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌కుమార్ కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు.

ములుగు తహసీల్దార్‌గా
ఆరిఫా బాధ్యతలు

ములుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ములుగు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌రెడ్డి బదిలీపై మర్కుక్ మండలానికి వెళ్లగా, అక్కడ పని చేస్తున్న ఆరిఫా ములుగుకు బదిలీపై వచ్చారు. ఈ మేర కు గురువారం ఆమె బాధ్యతలను స్వీకరించారు.

రెవెన్యూ డివిజన్ సాధించే వరకు కొట్లాడుతాం

- ప్రభుత్వం స్పందించి సాకారం చేయాలి
- మహాధర్నాలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రకంగా, భౌగోళికంగా అన్ని అర్హతలున్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా సాధించే వరకు రాజకీయాలకతీతంగా తెగించి కొట్లాడుదామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ చౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంగడిబజారు చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంత చరిత్ర ఎంతో గొప్పదన్నారు. చేర్యాల ప్రజల ఆకాంక్షమేరకు అసెంబ్లీ ఎన్నికల ముందు తాను డివిజన్ తీసుకొస్తానని ఇచ్చిన హామీ మేరకు అప్పటి సీఎం కేసీఆర్ కూడా అంగీకరించారని గుర్తుచేశారు. డివిజన్ పరిపాలనకు సరిపడా భవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే డివిజన్ ఏర్పాటై ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నం నెరవేరి ఉండేదన్నారు. కానీ దురదృష్టవశాత్తు అధికారంలోకి రాకపోయినప్పటికీ గళం విప్పి కొట్లాడుతున్నానన్నారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే రెవెన్యూ డివిజన్ విషయాన్ని ప్రస్తావించడంతో ఇక్కడి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి మద్దతుపలికారన్నారు. పలువురు నేతలు రాజకీయం చేస్తున్నారని, కుట్రలు చేస్తూ పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టానికి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జనగామ జిల్లా పర్యటనకు వచ్చిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్థానిక స్థితిగతులు, అభివృద్ధి పనులు, రెవెన్యూ డివిజన్ తదితర అంశాలను విన్నవించేందుకు వెళ్లిన తమపై కోడిగుడ్లు, టమాటాలతో దాడికి పాల్పడ్డారన్నారు. చేర్యాల ప్రజల మనోభీష్టం నెరవేర్చే దిశగా జిల్లాఅధికారులు, ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి పారదర్శక వాస్తవ నివేదికలు అందించాలని కోరారు. అంతకుముందు గాంధీ, తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చేర్యాలలోని గాంధీచౌక్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాలపై చిన్నచూపు తగదు

- అలుగు బెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇతర ప్రాంతాల్లో డివిజన్లు ఏర్పాటు చేసిందని, కానీ చేర్యాలపై చిన్నచూపు చూడడం తగదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మహాధర్నాకు మద్దతుగా హాజరైన ఆయన మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు డివిజన్‌ను కోరుకుంటున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు తాత్సారం వహిస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ నేతల ఇళ్లు ముట్టడిస్తాం

పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే ఆ పార్టీ నేతల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు, నాయకులు ఆముదాల మల్లారెడ్డి, కేవీఎల్ఎన్‌రెడ్డి, మోకు కనకారెడ్డి, బూరుగు సురేశ్, ఒగ్గు రాజు, బద్దిపడిగ కృష్ణారెడ్డి, పుర్మ వెంకటిరెడ్డి, అంకుగారి స్వరూపారాణి, భూమిగారి రాజేందర్, నాచగోని పద్మ, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు యాదవ్, పచ్చిమ డ్ల మానస, మంద యాదగిరి ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లాకు
బంగారు పతకం

మెదక్‌అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరుగుతున్న 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో మెదక్ జిల్లాకు బంగారు పతకం దక్కింది. జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాజశేఖర్ టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో బంగారు పతకాన్ని, సింగిల్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఆయనను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం అభినందించారు.

50 టీఎంసీలతో వద్దన్నా..
బీఆర్ఎస్ వినలేదు

- ఘోష్ కమిటీ విచారణ కొనసాగుతోంది
- గూడు చెదిరిన దృశ్యం కవితా సంపుటిలో నిర్వాసితుల గోసను కళ్లకు కట్టినట్లు వివరించారు
- ఎమ్మెల్సీ కోదండరాం

6 లో

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గజ్వేల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో ఉచితంగా డిఫెన్స్‌తో పాటు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ, అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వనున్నామని అకాడమీ నిర్వాహకులు నీల చంద్రం తెలిపారు. గురువారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న సంకల్పంతో ఆజాద్ అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ద్వారా వెలువడిన ఆర్ఆర్‌బీ, గ్రూప్-డి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ కోచింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో తెలంగాణ స్టేట్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు గానూ ఫ్రీ డెమో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9392691069, 9948643620 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వారితో నిర్వాహకులు జైపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్, రమేశ్, అంజద్, శ్రీకాంత్ తదితరులున్నారు.

50 టీఎంసీలతో వద్దన్నా.. బీఆర్ఎస్ వినలేదు

- ఘోష్ కమిటీ విచారణ కొనసాగుతోంది
- గూడు చెదిరిన దృశ్యం కవితా సంపుటిలో నిర్వాసితుల గోసను కళ్లకు కట్టినట్లు వివరించారు
- ఎమ్మెల్సీ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 50 టీఎంసీలతో నిర్మించడం అవసరం లేదని, పరిధిని తగ్గించి నిర్వాసితుల సంఖ్య తగ్గించాలని ప్రభుత్వానికి ఎంత చెప్పినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్సీ కోదండరాం ఆరోపించారు. ఈ విషయంపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. మల్లన్నసాగర్ నిర్వాసితులపై కొండి మల్లారెడ్డి రాసిన కవిత సంపుటి 'గూడు చెదిరిన దృశ్యం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం నిర్వహించారు. కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తితో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో భూములు, ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డ రైతుల జీవితాలను రచయిత కళ్లకు కట్టినట్టుగా చూపించారన్నారు. భౌగోళిక పరిస్థితుల పరంగా అంత పెద్ద ప్రాజెక్టు ఆ ప్రదేశంలో నిర్మిస్తే భూకంపాలకు దారి తీస్తుందని కేంద్ర సంస్థలు హెచ్చరికలు జారీ చేసినా గత ప్రభుత్వం బేఖాతరు చేసిందని గుర్తుచేశారు. ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన రైతులకు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు సరైన న్యాయం జరగలేదన్నారు. ఆ బాధతో ఓ రైతు తన ఇంట్లో తానే సొంతగా చితిపెట్టుకుని చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయన్నారు. నిర్వాసితులు ఇప్పటికీ ఆత్మగౌరవంతో బతకలేకపోతున్నారన్నారని, వారి జీవిత స్థితిగతులపై కొన్ని మల్లారెడ్డి ఇంత చక్కగా పుస్తకం రాయడం గొప్ప విషయం అని అందుకు ఆయనను అభినందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో హన్మంతరెడ్డి, కిసరి స్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. నలుగురి అరెస్ట్

వెల్దుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పేకాల స్థావరంపై వెల్దుర్తి పోలీసులు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తిలోని అంగడిపేట వీధిలో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.26,570 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పొలంలో జారిపడి యువకుడి మృతి

చేగుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట పొలంలో జారిపడి యువకుడు మృతిచెందిన సంఘటన చేగుంట మండలం చిట్టోజిపల్లిలో చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గోపి తిరుపతి(26) బుధవారం రాత్రి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి పొలంలో పడిపోవడంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతుడు రెండేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి చూడగా.. విగతజీవిగా కనిపించాడు. తిరుపతికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వెల్లడించారు.

50 కిలోల ప్లాస్టిక్ కవర్ల సీజ్

నారాయణఖేడ్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. 50 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

మెదక్ నుంచి మిర్జాపల్లి వరకు

రైల్వేలైన్ పొడిగించాలి

- కేంద్ర రైల్వే మంత్రికి లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడి ఉన్న మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నూతనంగా రైల్వేలైన్‌ను పొడిగించాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. మెదక్ నుంచి మిర్జాపల్లి వరకు రైల్వేలైన్‌ను అనుసంధానించాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రికి గురువారం ఆయన లేఖ రాసినట్లు తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రైల్వేలైన్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ చర్చి, ఏడుపాయల వనదుర్గా దేవస్థానం, మెదక్ ఖిల్లా వంటి పర్యాటక ప్రాంతాలున్నాయని గుర్తుచేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అక్కన్నపేట నుంచి మెదక్‌కు నూతన రైల్వేలైన్ మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి మిర్జాపల్లి వరకు రైల్వేలైన్ మంజూరు చేయాలని, ఇందుకోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవబోతున్నట్లు తెలిపారు. ఇక్కడి అవసరాలు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర రైల్వేశాఖ మంత్రి రైల్వేలైన్ అనుసంధానం కోసం మంజూరు ఇవ్వాలని కోరారు.

స్వయం ఉపాధిలో మహిళలు రాణించాలి

సిద్దిపేట జిల్లా మహిళా సంక్షేమ సహకార అధికారి శారద


సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిలో మహిళలు రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా మహిళా సంక్షేమ సహకార అధికారి శారద, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. సిద్దిపేటలో హాసిని టైలరింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు గురువారం వారు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ స్టేట్ చైర్మన్ వడగన రమేష్, స్టేట్ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, హాసిని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సాయి ప్రసన్న, ట్రైనర్స్ జ్యోతి, లహరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి

ములుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన ములుగు మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని క్షీరాసాగర్ గ్రామానికి చెందిన కుకునూరి శ్రీనివాస్(42) తన పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. భూమిపై పడి ఉన్న విద్యుత్ వైరును గమనించలేదు. శ్రీనివాస్ కాలుకు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు విగత జీవిగా పడి ఉన్న శ్రీనివాస్‌ను చూసి బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సదాశివపేట, జనవరి 30: (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన సంఘటన గురువారం సదాశివపేట పట్టణ పరిధిలో ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్ పరిశ్రమ సమీపంలో 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రియదర్శిని స్పిన్నింగ్ కాలనీకి చెందిన ఎదురింటి బాలమ్మ (50) గురువారం సాయంత్రం జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కొడుకు వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..
చికిత్స పొందుతూ యువకుడి మృతి

వర్గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ యువకుడు గురువారం మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. మినాజీపేట గ్రామానికి చెందిన దుండిగల్ల వెంకటేశ్(32) ఈనెల 12వ తేదీ సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో తన ద్విచక్రవాహనంపై మినాజీపేట నుంచి తునికి ఖాల్సా వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మహేంద్ర బొలెరో వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో వెంకటేశ్ కింద పడగా, తలకు బలమైన గాయాలయ్యాయి. వెంకటేశ్‌ను చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. వెంకటేశ్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టిన కారు
ఒకరికి తీవ్ర గాయాలు

కొండపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి మోటారుసైకిల్‌పై చేర్యాల వైపు నుంచి సిద్దిపేటకు వెళ్తున్నాడు. వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద మలుపు తీసుకుంటుండగా సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు ఢీకొట్టింది. దాంతో రామ్‌రెడ్డి కింద పడిపోగా తీవ్ర గాయాలు అయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి రామ్‌రెడ్డిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

మిరుదొడ్డి, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ హరీష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోత్రాల జ్యోతి(36) అనారోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. జ్యోతికి భర్త రాజు, కుమారుడు జస్వంత్, కుమార్తె గాయత్రి ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆసుపత్రికి తరలించారు.

కుంటలో దూకి వృద్ధురాలు..

గజ్వేల్‌రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో ఓ వృద్ధురాలు కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే సంగుపల్లికి చెందిన బడే సత్తమ్మ(66) భర్తతో పాటు కొడుకులు కొన్ని రోజుల క్రితం మృతిచెందారు. తీవ్ర మనోవేదనలో ఉన్న సత్తమ్మ జీవితంపై విరక్తితో సంగుపల్లి సమీపంలోని పాతకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

32 కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురి అరెస్ట్.. రూ.50 వేల నగదు, మూడు వాహనాలు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ సంజీవరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సంజీవరావు

మునిపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ముంబయి నుంచి హైదరాబాద్‌కు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 32 కిలోల గంజాయిని మునిపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు కంకోల్ టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్ మునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన బికాస్ కుమార్ మాలీ, సునీల్‌కుమార్ సహో, సంతన్ జాని, అక్షయ్‌కుమార్ గమంగో, రాజ్ కుమార్ బర్దన్, మహారాష్ట్రకు చెందిన దూకల్లె వసంత్ బాబురావు, హన్మంత్ రామదాస్ పవార్ ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశా రాష్ట్రం నుంచి బికాస్‌కుమార్ మాలీ గంజాయిని సేకరించి గుట్టుచప్పుడు కాకుండా కార్లల్లో.. ప్రత్యేకంగా క్యాబిన్లు తయారు చేసి మహారాష్ట్రకు తీసుకొచ్చి అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, గుల్బర్గ, మహారాష్ట్రలోని పూణే, సోలాపూర్, మాలెగావ్, వాశి, గోవా రాష్ట్రానికి చెందిన వారికి విక్రయించి డబ్బు సంపాదిస్తున్నారు. గురువారం ఉదయం ముంబయి నుంచి హైదరాబాద్‌కు వాహనాల్లో ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, సీసీఎస్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానంగా ఉన్న మూడు వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి, ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. డ్రైవర్ సీటు వెనకాల ప్రత్యేకంగా క్యాబిన్ తయారు చేసి 32 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు వారు వివరించారు. దీంతో మూడు వాహనాలను రూ.50 వేల నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని మునిపల్లి పోలీస్‌స్టేషన్ తరలించారు. గంజాయి విలువ సుమారు రూ.6.50 లక్షల వరకు ఉన్నట్లు తెలిపారు. కాగా మహారాష్ట్రకు చెందిన రావు సాహెబ్ గెనాకాలే, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కృష్ణ పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో కొండాపూర్ సీఐ వెంకటేశం, మునిపల్లి, పుల్కల్ ఎస్ఐలు రాజేష్ నాయక్, పాటిల్ క్రాంతికుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, రామునాయుడు, శ్రీకాంత్, ఏఎస్ఐ మాణిక్‌రెడ్డి, సిబ్బంది రేఖ్య, మతీన్, శశి, అన్వర్, సలీం, ప్రశాంత్, వందాస్, ఉదయ్‌కిరణ్, మోహన్, సతీష్, ఆసిఫ్, హనీఫ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లి జనజాతర

రెండో రోజు భారీగా తరలివచ్చిన భక్తులు
ప్రత్యేక పూజలు నిర్వహించిన న్యాయాధికారి



దుబ్బాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం జాతర రెండవరోజైన గురువారం భక్తజనసందోహంగా మారింది. ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి మహన్యాస ఏకాదశరుద్రాభిషేకంతో పాటు విశేష పూజలను నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. గంటల తరబడి వెచిఉంది దర్శనం చేసుకుని వేడుకున్నారు. ప్రధాన దారి నుంచి కూడవెల్లి చేరుకునే మార్గమంతా సందడిగా మారింది. తాత్కాలికంగా వెలిసిన దుకాణాల వద్ద కిక్కిరిసింది. సుమారు 80 వేల మంది భక్తులు జాతరకు విచ్చేశారని దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ఐ హరికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.



ఆలయంలో స్వామివారి ఊరేగింపు, కూడవెల్లి జాతరకు తరలివచ్చిన జనం



పుల్లూరులో భక్తిపారవశ్యం


పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సిద్దిపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ జాతర రెండోరోజు భక్తులతో కిక్కిరిసింది. గురువారం ఆలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగచారి, శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి గోపాల కాల్వలు సేవ, సుదర్శన నరసింహ హోమం, విష్ణుసహస్ర నామ పారాయణం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకరించి బండపై ఊరేగించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా బండపై చిన్నారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ లతావెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం మాతా

చుంచనకోట ఆలయంలో నవరాత్రోత్సవాలు
చేర్యాల నుంచి పాదయాత్రగా వెళ్లిన భక్తులు

చేర్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహ గురుస్థానం.. భువనేశ్వరీ మందిరంలో శైశిర మాఘ నవరాత్రోత్సవాలు గురువారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, విశేష అలంకరణగావించారు. తెల్లవారుజామున చేర్యాల పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి చుంచనకోట ఆలయం వరకు భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దేవీ స్తోత్రనామపారాయణం చేశారు.




పుల్లూరు బండపై కిక్కిరిసిన జనం, పూజలు చేస్తున్న భక్తులు, అమ్మవారి నామస్మరణతో చేర్యాల నుంచి పాదయాత్రగా చుంచనకోటకు తరలివెళ్తున్న భక్తులు

వసంత పంచమి ఏర్పాట్ల పరిశీలన


వర్గల్ విద్యాధరి క్షేత్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

వర్గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఈనెల 3న నిర్వహించనున్న వసంత పంచమి (శ్రీపంచమి) ఏర్పాట్లను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి గురువారం పర్యవేక్షించారు. ప్రత్యేక, సాధారణ దర్శనం, పార్కింగ్, అక్షరభ్యాస మండపాన్ని పరిశీలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు రద్దీ దృష్ట్యా పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌కు ఆహ్వానం..


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేసిన ఆహ్వానపత్రిక

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో జరగనున్న వసంత పంచమి వేడుకలకు రావాల్సిందిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవత ఓంకార్, మాలె శ్రీనివాస్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

- ఇంటి గోడ కూల్చారంటూ సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఓ కుటుంబం హల్‌చల్
- మాజీ కౌన్సిలర్ కక్ష సాధింపుతో చేస్తున్నారని ఆవేదన
- నచ్చజెప్పిన పోలీసులు, మున్సిపల్ అధికారులు


సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్న బాధితులు

సిద్దిపేట టౌన్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : క్షక్ష సాధింపుతో తమకు ఎలాంటి సమాచారమివ్వకుండానే ఇంటి గోడను కూల్చివేశారంటూ ఓ కుటుంబం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట డీజిల్ పోసుకొని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని 12వ వార్డు రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన వసూపునూరి నిర్మల తనకున్న 145 గజాల్లో ఇంటి నిర్మాణం కోసం 2021లో మున్సిపల్ కార్యాలయంలో రూ.70 వేలు చెల్లించి అనుమతి పొందింది. 45 గజాలు వెనక్కి జరిగి 100 గజాల్లో ఇంటి నిర్మాణం చేసింది. కాగా సెట్‌బ్యాక్‌లో రోడ్డుకు 4 ఫీట్లు వదిలి ఇంటి బోరు పాయింట్ నుంచి 2022లో ప్రహరి మినహా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అదే ఏడాది చివరి నెలలో ప్రహరి నిర్మాణం చేపడుతుండగా కాలనీకి చెందిన ఇద్దరు మున్సిపల్ కార్యాలయంలో ఎలాంటి ఆధారాలు చూపెట్టకుండానే సెట్‌బ్యాక్ లేదని తమపై ఫిర్యాదు చేశారు. నోటీసులివ్వకుండానే మున్సిపల్ అధికారులు ప్రహరిని కూల్చివేయడంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నారు. ఈ మేరకు 2023లో కోర్టు నుంచి అనుకూలంగా తీర్పు రావడంతో 15 రోజుల క్రితం ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అధికారులు ఎలాంటి నోటీసులివ్వకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రహరీని కూల్చివేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో గురువారం నిర్మల కుటుంబం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు పాల్పడగా పోలీసులు, మున్సిపల్ అధికారులు నచ్చజెప్పారు.

మాజీ కౌన్సిలర్ కక్ష్యసాధింపుతోనే కూల్చివేతలు


కూల్చివేసిన ప్రహరీ

మాజీ కౌన్సిలర్‌కు తమ ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష వరకు వసూలు చేశాడని చెప్పడంతోనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు. 2021లో ఇంటి నిర్మాణం కోసం అనుమతి రాగా అప్పటి కౌన్సిలర్ 18 ఫీట్లు వెనకకు జరిగి ఇంటి నిర్మాణం చేపట్టాలని 4 ఫీట్లు మాత్రమే జరిగి ఇళ్లు నిర్మాస్తున్నారని, తనకెంతా ఇస్తావంటూ అడగగా రూ.లక్ష చెల్లించినట్లు బాధితులు రోదిస్తూ తెలిపారు. 2022 ఏడాది చివరి నెలలో మున్సిపల్ అధికారులు వచ్చి కూల్చడంలో స్థానిక కౌన్సిలర్ పాత్ర ఉందని తెలియడంతో రూ. లక్ష ఇచ్చానా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించామన్నారు. అందరి ముందు చెప్తావా అంటూ మనసులో పెట్టుకుని ఇదంతా చేస్తున్నాడని ఆరోపించారు.

గోడను ఎలా కూలగొట్టుతారు?

డబ్బులు కూడపెట్టుకుని కట్టుకున్న ఇంటి గోడను మునిసిపల్ సిబ్బంది ఎలా కూలగోడతారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద తమ ఇంటి గోడను మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారంటూ బాధితులు డిజీల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ విషయం తెలుసుకొని వారిని పరామర్శించి ఆందోళన పడవద్దని కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబం డబ్బులు పోగు చేసుకుని గతంలో ఓ ఇల్లు నిర్మాణం చేసుకున్నారన్నారు. ఆ ఇంటి నిర్మాణంలో ప్రహరీ నిర్మించేందుకు ఓ మాజీ కౌన్సిలర్ లక్ష రూపాయలు డిమాండ్ చేశారని ఆరోపించారు. డబ్బు ఇవ్వకపోవడంతో గతంలో ఇంటి గోడ నిర్మించకుండా అడ్డుపడి మున్సిపల్ అధికారులతో ఇంటిని కూడా కూల్చివేశారని తెలిపారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించి, కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గోడ నిర్మించడంతో మళ్లీ మున్సిపల్ సిబ్బంది వచ్చి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి గోడ కూల్చివేయడం అన్యాయమని తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని బొంద పెట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గయాజుద్దీన్, నజ్జు, ఫయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

గజ్వేల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కూలిపోయిన మురుగు కాలువ కల్వర్టుకు గురువారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యను కాంగ్రెస్ నాయకుడు జంగం రమేశ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి పరిష్కరించారు.

గద్దర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

రాయపోల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్దనౌక గద్దర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన రాయపోల్‌లో ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ని కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే గద్దర్ జయంతి సభకు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, విష్ణు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

● ప్రొఫెసర్ చిన్నికృష్ణ రెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ నిజాంబాద్, అదిలాబాద్, క రీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా తనను గెలిపించలని ప్రొఫెసర్ చిన్నికృష్ణరెడ్డి కోరారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లా వాసిగా ఇక్కడ నుంచి విద్యా ప్రస్థానం మొదలుపెట్టి ఓయూలో ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందానన్నారు. తెలంగాణ యువశక్తి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, నర్సింహరెడ్డి, రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో బండరాయి పడి మరణించిన కూలీల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ కూలీల రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవలసిన అధికారులు నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందని అన్నారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి మాజీ ఉప సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, జిల్లా నాయకులు బోయిని మల్లేశం, మల్కని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

50 పశువులకు వైద్య పరీక్షలు

మద్దూరు, జనవరి 30 : మండలంలోని వంగపల్లి గ్రామ శివారులోని ఉప్పరోనిగడ్డలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరికిషన్, జనగామ గోపాల మిత్ర సూపరింటెండెంట్ జైపాల్, భైరాన్‌పల్లి పశు వైద్యాధికారి ఉషా, గోపాల మిత్రలు అంజనేయులు, రాములు, రవి, వీఏ నవీన్, ఓఎస్‌లు సత్యం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి బియ్యం అందజేత

సిద్దిపేట అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాహిత మానవ పరిరక్షణ కమిటీ తెలంగాణ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలో అనాథ ఆశ్రమానికి ఉచితంగా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ వడగన రమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, స్టేట్ సెక్రటరీ అశోక్ రెడ్డి ,జిల్లా సెక్రటరీ పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

చేర్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల స్థాయి ఆటల పోటీలు గురువారం చేర్యాల పట్టణంలోని వికాస్ గ్రామర్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నకాశీ టూరిజం గెస్టహౌజ్‌లో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ఎన్ వైకే ఆర్గనైజర్ ఎనుగుల నితీశ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. యువత, విద్యార్థులు క్రీడలలో రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌వైకే బృందం కొట్టిగణేశ్, దాసరి శివకుమార్, నరేశ్, వెంకటేశ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కోతుల బెడద

● పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

● సోలార్ సిస్టంతో పంట చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు రైతుల ఆసక్తి



అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో మొక్కజొన్న పంట చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్

అక్కన్నపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కోతుల నుంచి మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. కోతులు గుంపులుగా పంటలపై దాడిచేసి మొక్కజొన్న కంకులను తింటుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు కాపలా ఉంటూ నానా అగచాట్లు పడుతున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లోని గ్రామాల్లో రైతులు పదివేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. చాలా గ్రామాల్లో కోతుల బెడద ఉన్నది. దీంతో పంటలను రక్షించుకునేందుకు కొందరు సౌండ్ వచ్చే ఛార్జింగ్ మైకులు ఏర్పాటు చేస్తుండగా, మరికొందరు బెదిరే బొమ్మలను పంట పొలాల్లో పెడుతున్నారు. అయినా కోతుల బెడద తగ్గడం లేదని ఇంటికి వచ్చి మళ్లీ పంట చేనుల వద్దకు వెళ్లేసరికి పంటను ధ్వంసం చేస్తున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటలను ఎలాగైనా కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డి అనే రైతు తను సాగు చేసిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రూ.10 వేలతో సోలార్ బ్యాటరీ కొనుగోలు చేశాడు. తను సాగు చేసిన పంట చుట్టూ వైరుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. దీంతో ఫెన్సింగ్ వైరుకు కోతులు, అడవి పందులు తగలడంతో షాక్ కొట్టి అటువైపు మళ్లీ రావడం లేదని పేర్కొంటున్నాడు. దీంతో చాలామంది రైతులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.



సోలార్ బ్యాటరీ ఏర్పాటు చేసిన రైతు

హరితహారం మొక్కలు నరికివేత

● ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన ఫారెస్ట్ అధికారులు



ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

కొండపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా రాజీవ్ హరిత హారం మొక్కలను తొలగిస్తుండగా ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన కొంతమంది వెంచర్ చేయడం కోసం రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్లను తొలగించారు. మరికొన్నింటిని తొలగించే ప్రయత్నం చేస్తుండగా సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్ , బీట్ ఆఫీసర్ చందు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి సిద్దిపేట ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయూడబ్ల్యూజే ఎజెండా

● టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ

గజ్వేల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయూడబ్ల్యూజే ఎజెండా అని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆ సంఘం-2025 డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. రెండు నెలల్లో జర్నలిస్టులకు అక్రిడిటేషన్, హెల్త్‌కార్డులు అందుతాయన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, జమీల్, ప్రభాకర్, సురేందర్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, పవన్, నాగవెంకట్‌రెడ్డి, యాదగిరి, రమణారెడ్డి, బాల్‌నరసయ్య, జగదీశ్వర్, ఎల్లం, నర్సింలు, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, పులి బాల్‌చంద్రం పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

● ఊరూరా వర్ధంతి కార్యక్రమాలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు విద్యార్థులు

వర్గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

● చేర్యాల : మహాత్మా గాంధీ వర్ధంతిని చేర్యాల, కొమురవెల్లి మండలాలల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● మర్కుక్: మండలంలోని చేబర్తి గ్రామంలో గుడాల శేఖర్ గుప్త ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బురి రాందాస్‌గౌడ్ తదితర నాయకులు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

● సిద్దిపేట టౌన్ : సిద్దిపేట పట్టణంలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నివాళులర్పించారు.



కొమురవెల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గాంధీజీ.. కాంగ్రెస్‌కు మంచి బుద్ధిని ప్రసాదించండి

న్యూస్ నెట్‌వర్క్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కళ్లు తెరిపించి, ఇచ్చిన హామీలను అమలు చేసే బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ గురువారం ఆ పార్టీ నాయకులు మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు.



రాయపోల్‌లో హెల్మెట్లు ధరించి ర్యాలీ తీస్తున్న విద్యార్థులు



గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

నిబంధనలు పాటించాలి

కుకునూరుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల సందర్భంగా కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, వాహనదారులతో కలిసి నిర్వహించిన ర్యాలీని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ప్రారంభించారు.

● రాయపోల్ : పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు హెల్మెట్లతో ధరించి ర్యాలీ నిర్వహించారు.

● గజ్వేల్ : గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● మద్దూరు : మండలకేంద్రంలో ఎస్ఐ మహబూబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై నినదించారు.

● సిద్దిపేట కల్చరల్ : జిల్లా కేంద్రంలోని క్రాంతి హైస్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతా, నియమనిబంధనలపై సిద్దిపేట రవాణశాఖాధికారి శంకర్ నారాయణ అవగాహన కల్పించారు.

● దౌల్తాబాద్ : మండల పరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యువతకు, ప్రజలకు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అవగాహన కల్పించారు.

బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



ఆలయ నూతన కమిటీతో పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బర్మ రామచంద్రం, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద పాండు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న కృషిని ప్రజలు మరిచిపోరని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. మండలంలోని చిన్నకోడూరు నుంచి చౌడారం వరకు బీటీ రోడ్డు మరమ్మతుకు రూ.1.58 కోట్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ ప్రజాప్రతినిధులు ఉమేష్ చంద్ర, ఎల్లయ్య, శ్రీనివాస్, నాయకులు కొండం రవీందర్ రెడ్డి, జంగిటి శ్రీనివాస్, వెంకటేశం, బాలయ్య, భూంరెడ్డి, వాసు, వేణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నేతలు

సిద్దిపేట రూరల్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ ఏనాడు అవార్డులు, పదవుల కోసం ఆశించకుండా బడుగు,బలహీన వర్గాలకోసం, తెలంగాణ ఏర్పాటుకు తన వంతు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని గుర్తు చేశారు. వెంటనే బండి సంజయ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు చేగురి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దోటి బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

కుకునూరుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డి అక్కన్నపేట్ భూంపల్లి మండలంకు బదిలీ అయ్యారు. దీంతో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యాలయ సిబ్బంది మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సుజాతను, బదిలీపై వెళ్తున్న మల్లికార్జున్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

గురుకులాల పనివేళలను మార్పుచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

చేర్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల పనివేళలను శాస్త్రీయబద్ధంగా మార్పుచేసి ప్రభుత్వం విద్యార్థులకు సరళీకృత విద్యనందించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. చేర్యాల మండలకేంద్రంలో గురువారం నిర్వ హించిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదురకాల గురుకులాలను ఒకే గొడుకు కిందికి తీసుకువచ్చి కామన్ డైరెక్టర్ ఏర్పాటుతో పాటు విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపచేయాలని కోరారు. త్వరలో జరగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో నాయకులు షేక్ వలీ అహ్మద్, తప్పెట్ల యాదగిరి, చిర్ర యాదగిరి, ప్రశాంత్ కుమార్, తలారి కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



గ్రంథాలయ భవనం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చేర్యాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు పెడుత ల ప్రతాప్‌రెడ్డి, పెడుతల బాలమణి ఇటీవల తమ సొంత ఖర్చులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మింపచేశారు. ఈ సందర్భంగా గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పెడుతల ప్రతాప్‌రెడ్డి అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు, యువత తమ దైనందిన జీవితంలో గ్రంథాలయ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పెడుతల ఎల్లారెడ్డి, కొంగరి వెంకట్‌మావో, కమలాకర్, చంద్రమౌళి, ముస్త్యాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

వర్గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచాగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బ్రహ్మాండ్లపల్లి వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య సోదర సోదరీమణులు అధికంగా పాల్గొని అమ్మవారి పూజా ఆశీస్సులు పొందాలని పేర్కొన్నారు.

భూములు అమ్మబడును

(5వ పేజీ తరువాయి)

గత ఏడాదితో పోల్చితే జిల్లావ్యాప్తంగా 6056 డాక్యుమెంట్లు తక్కువగా వచ్చినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. నాడు 34,462 డాక్యుమెంట్ల ద్వారా రూ.75కోట్ల ఆదాయం రాగా.. గడిచిన ఏడాది కాలంలో 28,406 డాక్యుమెంట్లకు రూ.69కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది.

జిల్లా అంతటా ఇదే పరిస్థితి..

● చిన్నకోడూరు శివారులోని వ్యవసాయ భూమి ఎకరాకు రూ.50 లక్షలకు విక్రయించారు. తాజాగా ఇదే ప్రాంతంలో ఎకరాకు రూ.32లక్షలకు అమ్మడం గమనార్హం.

● మిరుదొడ్డి, అక్బరుపేట-భూంపల్లి మండలాల్లో ఎకరాకు రూ.50లక్షలు పలికిన భూమిని రూ.25లక్షలకు అడుగుతున్నారు.

● హుస్నాబాద్ ప్రాంతంలో రూ.12లక్షలు పలికిన గుంట భూమికి రూ.8లక్షలు ధర నిర్ణయించినా అమ్ముడుపోవడం లేదు.

● ములుగులో ఏడాది క్రితం ఎకరాకు రూ.కోటి వెచ్చించగా ఇప్పుడు రూ.60లక్షలు చెప్పినా కొనే పరిస్థితి లేదు.

● దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఎకరాకు రూ.60లక్షలు, దొమ్మాట, గాజులపల్లి, సూరంపల్లి, ముబారస్‌పూర్ గ్రామాల్లో రోడ్డుకు రూ.50లక్షలు ధర ఉండేది. ఇప్పుడు రూ.30లక్షలకే అడుగుతున్నారు. ఇదే దౌల్తాబాద్ మండల కేంద్రంలో రూ.40వేలకు గజం పలికిన స్థలాన్ని నేడు కన్నెత్తి చూడడం లేదు.

● గజ్వేల్‌లో గజం స్థలానికి రూ.22వేల చొప్పున కొనుగోలు చేశారు. ప్రస్తుతం అదే స్థలాన్ని రూ.16వేల చొప్పున విక్రయించుకున్నారు.

● రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లిలో గుంటకు రూ.లక్షా 30వేలకు కొనుగోలు చేసిన భూమిని ఇటీవల రూ.90వేల చొప్పున అమ్మారు.

● తొగుట మండలంలో ఎకరానికి రూ.40లక్షలు పలికిన భూములు ప్రస్తుతం రూ.30లక్షలు చెబుతున్నారు. కానీ కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

● దుబ్బాకలో రూ.60లక్షలకు ఎకరం చొప్పున హబ్సీపూర్ మార్కెట్‌లో విక్రయించిన భూములు నేడు అవసరానికి రూ.30లక్షలకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. దుబ్బాక శివారులో గజానికి రూ.10వేలు పలికిన ఇంటి స్థలాలు రూ.4వేలకు గజం పడిపోయిందంటే అతిశయోక్తి కాదు.

● చేర్యాల మండలంలో ఏడాది క్రితం మారుమూలన ఉన్న భూములకూ ఎకరాకు రూ.50లక్షల పైచిలుకు ధర పలికింది. అవే భూములు నేడు రూ.35లక్షలకు బేరం పెడుతున్నారు.